సాక్షి అనకాపల్లి

గురువారం : 6 : ఏప్రిల్ : 2023



సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట

సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని ప్రభుత్వ విఫ్ కరణం ధర్మశ్రీ అన్నారు. 8లో



భజన పోటీల విజేత పార్వతీపురం

కె.జె.పురంలో నిర్వహించిన భజన పోటీల్లో పార్వతీపురం భజన బృందానికి ప్రథమ బహుమతి లభించింది. 8లో



ఘనంగా ధర్మపీఠం పండగ

చినపాచిల గ్రామంలో న్యాయదేవతగా పేరొందిన ధర్మపీఠం(పెద్దరాయి) పండగను బుధవారం ఘనంగా నిర్వహించారు. 8లో

రంజాన్ వేళలు

అనకాపల్లి
ఇఫ్తార్ (గురు) సహర్ (శుక్ర)
6-14 4-33
నర్సీపట్నం
6-18 4-32

న్యూస్‌రీల్

ఆలివ్‌రిడ్లే సంతతిని కాపాడుకోవాలి



ఆలివ్ రిడ్లే తాబేలు పిల్లలను సముద్రంలోకి విడిచిపెడుతున్న జేసీ కల్పనా కుమారి

పరవాడ: ఆలివ్‌రిడ్లేతాబేళ్ల సంతతిని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి పిలుపునిచ్చారు. సింహాద్రి ఎన్టీపీసీ ఆర్థిక సహకారంతో ముత్యాలమ్మపాలెం తీరం హేచరీలో సంరక్షించిన 500 ఆలివ్‌రిడ్లే తాబేళ్లను జేసీ బుధవారం సముద్ర జలాల్లోకి వదిలారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జేసీ మాట్లాడుతూ తాబేలు పిల్లల పెంపకానికి నిధులు కేటాయిస్తున్న సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యాన్ని అభినందించారు. తీరంలో తాబేళ్లు పెట్టిన గుడ్లను సేకరించి అక్కడే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హేచరీలో పిల్లలను పొదిగించి అనంతరం సముద్ర జలాల్లో విడిచిపెట్టడానికి అవసరమైన వ్యయాన్ని ఎన్టీపీసీ భరిస్తోందని ఫారెస్టు సెక్షన్ అధికారి ఎ.వి.ఎస్.కె.వర్మ చెప్పారు. అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమంలో ఆ శాఖ సిబ్బంది ఈ.శివ తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికల్లో షెడ్ల నిర్మాణానికి నిధులు



ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి

కశింకోట: మండలంలోని పలు గ్రామాల్లో శ్మశాన వాటికల్లో షెడ్ల నిర్మాణం, బోర్ల ఏర్పాటుకు తన ఎంపీ కోటా నిధుల నుంచి రూ.39 లక్షలు కేటాయించినట్టు అనకాపల్లి ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి ఓ ప్రకటనలో బుధవారం తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయల కల్పనలో భాగంగా నిధులు కేటాయించినట్టు చెప్పారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌తోపాటు ఎంపీపీ కలగా లక్ష్మి, నాయకులు, అధికారులు, ప్రజల వినతి మేరకు ఈ నిధులు కేటాయించామన్నారు. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి తామంతా మరింత కృషి చేస్తామన్నారు.

నిరాశ్రయులకు కేజీహెచ్‌లో ప్రత్యేక వార్డు



సేవా వార్డును ప్రారంభిస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ అశోక్‌కుమార్

మహారాణిపేట(విశాఖ): నిరాశ్రయులకు కేజీహెచ్‌లో ప్రత్యేకంగా సేవా వార్డును ఏర్పాటు చేశారు. బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా బుధవారం కేజీహెచ్ సూపరింటెండెంట్ పి.అశోక్‌కుమార్ ఈ వార్డును ప్రారంభించారు. ఎవరూ లేని వారి కోసం పాత బ్లడ్ బ్యాంక్‌కు ఎదురుగా 10 పడకలతో ఈ వార్డును ఏర్పాటు చేశారు. వీరికి ఉత్తమ సంరక్షణ, చికిత్స అందిస్తామని డాక్టర్ అశోక్‌కుమార్ తెలిపారు. ఆర్ఎంవో కె.జగదీష్ కుమార్ ఏఆర్ఎంవో ఎ.విజయలక్ష్మి, నర్సింగ్ సూపరింటెండెంట్లు రమణమ్మ, కల్పనా మౌళి, హెల్త్ ఇన్‌స్పెక్టర్ పి.ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశానికి మే 20న ప్రవేశ పరీక్ష

భీమునిపట్నం: విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి వచ్చే నెల 20న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు జిల్లా కో–ఆర్డినేటర్ కె.రాంబాబు తెలిపారు. నర్సీపట్నం బాలురు, అచ్యుతాపురం బాలికలు, భీమిలి బాలికల గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశానికి, 6, 7, 8 తరగతుల్లో ఖాళీల భర్తీ కోసం ఈ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందుకు సంబంధించి దరఖాస్తులను https//aprs.apcfss.in ద్వారా ఈ నెల 24లోపు సమర్పించాలని సూచించారు.

లాభాల బిందు సేద్యం

వ్యవసాయ విప్లవానికి ప్రభుత్వం తెరతీసింది. అన్నదాతకు అన్ని విధాలుగా అండగా నిలుస్తోంది. ఈ క్రమంలోనే సేద్యం సులభతరం చేసేందుకు బిందు పరికరాలను సమకూరుస్తోంది. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించేందుకు రైతులను ప్రోత్సహిస్తోంది. డ్రిప్ పరికరాలను రాయితీపై పంపిణీ చేస్తోంది. ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులకు 90శాతం వరకూ సబ్సిడీ ఇస్తోంది.

- సూక్ష్మ సేద్యానికి ప్రభుత్వ ప్రోత్సాహం
- ఇప్పటి వరకు రూ.2.65 కోట్ల రాయితీ
- జిల్లాలో డ్రిప్, స్ప్రింక్లర్ల ఏర్పాటుకు ఇచ్చిన లక్ష్యం 600 హెక్టార్లు
- ఇప్పటి వరకూ రిజిస్ట్రేషన్లు జరిగినవి 1721 హెక్టార్లు
- పరిపాలనా పరమైన అనుమతి పొందినవి 832 హెక్టార్లు
- 572 హెక్టార్లలో పరికరాల అందజేత



డ్రిప్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు



సూక్ష్మ సేద్యం అమలు తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి(ఫైల్)

అనకాపల్లి రూరల్ : ప్రతి నీటి బొట్టునూ ఒడిసిపట్టేలా ప్రభుత్వం బిందు, తుంపర సేద్యాన్ని ప్రోత్సహిస్తోంది. ఇందుకోసం సన్న, చిన్నకారు రైతులకు రాయితీలు అందిస్తోంది. ఆసక్తిగల రైతులు తమ పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో పేర్లను రిజిస్ట్రేషన్లు చేయించుకునే వెసులుబాటును కల్పించింది. ప్రస్తుతం ఈ ప్రక్రియ జిల్లాలో ముమ్మరంగా సాగుతోంది. ఇప్పటికే లక్ష్యాన్ని మించి రిజిస్ట్రేషన్లు రావడంతో ఈ మేరకు జిల్లాలో సూక్ష్మ వ్యవసాయానికి అధికారులు తమ వంతు కృషి చేస్తున్నారు. డ్రిప్, స్ప్రింక్లర్ల ఏర్పాటుతో నీటి వృథాను అరికట్టడంతో పాటు విద్యుత్‌ను కూడా పొదుపు చేయవచ్చు. మొక్కకు సరిపడా నీరందే పంట దిగుబడి గణనీయంగా పెరుగుతుంది. ఈ విధానం రైతులకు లాభదాయకంగా ఉంటోంది.

లక్ష్యాన్ని మించి రిజిస్ట్రేషన్లు

డ్రిప్, స్ప్రింక్లర్ల ఏర్పాటుకు సంబంధించి జిల్లాలో 600 హెక్టార్లకు మంజూరు చేయాలనేది ఏపీఎంఐపీ లక్ష్యం. ఈ ఏడాది మార్చి 31 నాటికి 1721 హెక్టార్లకు రిజిస్ట్రేషన్లు జరిగాయి. వీటిలో 877 మంది రైతుల దరఖాస్తులకు పరిపాలనా ఆమోదం లభించింది. వీటి ద్వారా 832 హెక్టార్లకు రాయితీపై సూక్ష్మ సేద్యం పరికరాలను ఇవ్వాల్సి ఉండగా ఇప్పటి వరకూ 572 హెక్టార్లకు బిందు, స్ప్రింక్లర్ల యూనిట్లను రైతులకు అందజేశారు. మిగిలిన రైతులకు మరో 10 రోజుల్లోగా పరికరాలను అందించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

రాయితీ రూ.2.65 కోట్లు

బిందు, తుంపర సేద్యం పరికరాల కోసం దరఖాస్తు చేసుకునే రైతులకు భూమి విస్తీర్ణం మేరకు రాయితీ లభిస్తుంది. జిల్లాలో ఇప్పటి వరకు రూ.2,65,90,000 రాయితీ ఇచ్చారు. 5 ఎకరాల్లోపు రైతులకు ప్రభుత్వం 90 శాతం సబ్సిడీతో సూక్ష్మ సేద్యం సదుపాయాన్ని కల్పిస్తోంది. 5 నుంచి 10 ఎకరాల్లోపు రైతులకు 70శాతం సబ్సిడీ ఇస్తోంది. సబ్సిడీ పోగా మిగిలిన సొమ్ము రైతులు చెల్లించాల్సి ఉంటుంది. గతంలో డ్రిప్‌ఏర్పాటు చేసుకుని ఏడేళ్లు ముగిసిన రైతులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాలను పంపిణీ చేసే 5 కంపెనీల్లో రైతులు దేన్నయినా ఎంపిక చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది.

క్షేత్రస్థాయిలో పరిశీలన

డ్రిప్,స్ప్రింక్లర్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఎంత భూమి ఉంది, బోరు సదుపాయం ఉందా ? ఉంటే అందులో ఎంత నీరు వస్తోంది. రైతు పొలంలో ఎన్ని చెట్లు ఉన్నాయి ?పైపుల ఏర్పాటుకు ఎంత ఖర్చవుతుంది ?ఇందులో రైతుకు ఎంత సబ్సిడీ వర్తిస్తుందనే విషయాలను రైతు భరోసా కేంద్రాల ఉద్యాన,వ్యవసాయశాఖల అసిస్టెంట్లు , కంపెనీ ప్రతినిధులు వెళ్లి, క్షేత్ర స్థాయిలోపరిశీలించి వివరాలు నమోదు చేసుకుంటున్నారు. ఇప్పటి వరకూ 877 మంది రైతులకు సంబంధించిన 832 హెక్టార్లకు పరిపాలనా అను మతులు మంజూరయ్యాయి. ఇందులో 572 ఎకరాలకు డ్రింప్, స్ప్రింక్లర్ల పరికరాలను అందజేశారు.

అర్హులందరికీ పరికరాలు



డ్రిప్,స్ప్రింక్లర్ల ఏర్పాటుకు సంబంధించి లక్ష్యానికి మించి అదనంగా యూనిట్లు అందించడానికి కృషి చేస్తున్నాం. రైతులు తమ పరిధిలో రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్లు చేసుకోవాలి. ఆర్‌బీకే ఇన్‌చార్జిలు కంపెనీప్రతినిధుల ద్వారా ప్రాథమిక సర్వే చేయించుకోవాలి. రిజిస్ట్రేషన్లు చేయించుకున్న అర్హులైన ప్రతి రైతుకు డ్రిప్, స్పింక్లర్లను మంజూరు చేస్తాం. ఉద్యాన, వ్యవసాయశాఖ అసిస్టెంట్ల ద్వారా పరికరాలను అందజేస్తాం. ఆర్‌బీకే ద్వారా రైతులు తమకు ఏ కంపెనీ డ్రిప్ పరికరా లను కావాలో ఎంచుకోవచ్చు. వారు ఎంపిక చేసుకున్న కంపెనీతోయూనిట్లు ఇన్‌స్టాల్‌చేయిస్తున్నాం.
– జి.వి.లక్ష్మి, జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారిణి, అనకాపల్లి

మహా యజ్ఞంలా 'మా నమ్మకం నువ్వే జగన్'

- రేపటి నుంచి 20వ తేదీ వరకు భారీ కార్యక్రమానికి శ్రీకారం
- ప్రభుత్వం చేసిన మంచిని ప్రతి ఇంటికీ వెళ్లి వివరించడమే లక్ష్యం
- ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు



విలేకరులతో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్లలో అందించిన సంక్షేమ కార్యక్రమాలు, చేసిన అభివృద్ధి పనులను ఇంటింటికీ వెళ్లి వివరించడమే 'జగనన్నే మా భవిష్యత్తు– మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. మండలంలోని తారువ క్యాంప్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'మా నమ్మకం నువ్వే జగన్' అనేది ప్రజల నినాదమని, ఈ నెల 7 నుంచి 20 వరకు 14 రోజుల పాటు మహాయజ్ఞంలా నిర్వహించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వానికి, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ఉన్న తేడాను సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల ద్వారా ప్రజలకు తెలియజేస్తామన్నారు. జగన్ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా చేస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలకు వివరిస్తామని చెప్పారు. బాధ్యతగా సేవలందించి, ప్రజల జీవితాల్లో అనుహ్య మార్పును తీసుకువచ్చిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందన్నారు.పార్టీ అజెండా రూపకల్పన నుంచి పార్టీ విధి విధానాలు, సంక్షేమ పథకాల అమలు తీరు, మెరుగైన పాలన అందిస్తున్న తీరును రాష్ట్ర ప్రజలంతా గుర్తించారని చెప్పారు. పార్టీ నాయకులు జనంలోకి వెళ్లినప్పుడు, గడపగడపకు మన ప్రభుత్వం పేరిట ఇంటింటికీ తిరిగినప్పుడు, వలంటీర్లు క్షేత్ర స్థాయి నుంచి తీసుకొచ్చిన సర్వేల ద్వారా సమాజంలో 80 నుంచి 90 శాతం గుణాత్మకమైన మార్పు కనిపిస్తున్నట్టు నిరూపితమైందన్నారు. సీఎం జగన్‌పై తాము పెట్టుకున్న నమ్మకాన్ని రెండింతలు నిలబెట్టుకున్నారని, అందుకే తాము నమ్ముతున్నామని ప్రజలు చెబుతున్నారన్నారు. మా భవిష్యత్ జగన్‌మోహన్‌రెడ్డిలో కనిపిస్తోందని బలంగా ప్రజల మాటల్లో వినిపిస్తోందని డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు తెలిపారు. జగనన్న సైన్యం ప్రజలతో మమేకమై ప్రజల అవసరాలను గుర్తిస్తారని ఆయన చెప్పారు. అందుకు అనుగుణంగా పార్టీ అజెండాను రూపొందిస్తారన్నారు. గ్రామాల్లో ఇంటింటినీ సందర్శించే సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు జేసీఎస్ మండల ఇన్‌చార్జులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు సహకరించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి సత్యం, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు, యువజన అధ్యక్షుడు కర్రి సూరినాయుడు, కొప్పల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ వరదపురెడ్డి సింహాచలం నాయుడు, సర్పంచ్‌లు నాగిరెడ్డి శతారినాయుడు, గూడెపు రాము, ఉగ్రాకుల అప్పారావు, కాటిపాం పెదనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వెల్ఫేర్ అసిస్టెంట్‌పై విచారణ

- కక్షపూరితంగా చేదోడు లబ్ధిదారుల పేర్లను తొలగించారని ఆరోపణ

గొలుగొండ : కృష్ణదేవిపేట గ్రామ సచివాలయం పరిధిలో అర్హత ఉన్న వారికి చేదోడు పథకం అందకపోవడంపై లబ్ధిదార్ల ఫిర్యాదు మేరకు బుధవారం విచారణ నిర్వహించారు. కృష్ణదేవిపేట గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ సీహెచ్ అప్పలనాయుడు గ్రామంలో అర్హత ఉన్న వారికి ప్రభుత్వ పథకాలు అందకుండా, కక్షపూరితంగా వ్యవహరిస్తున్నట్టు గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో గ్రామ, వార్డు సచివాలయ నోడల్ అధికారి మంజులవాణి విచారణ చేపట్టారు. గ్రామంలోని టైలర్లకు గతేడాది వరకు చేదోడు పథకంలో లబ్ధి చేకూరింది. 2022–23లో కక్షపూరితంగా వీరి పేర్లను ఆన్‌లైన్లో తొలగించడంపై సచివాలయంలో విచారణ జరిపారు. అబ్ధిదారులకు అన్ని అర్హతలు ఉన్నట్లు గుర్తించారు. పూర్తి నివేదికను సిద్ధం చేసి, వెల్ఫేర్ అసిస్టెంట్‌పై శాఖపరమైన చర్యలకు ఉన్నతాధికారులకు నివేదించనున్నట్టు విచారణ అధికారి తెలిపారు.

బాబూ జగ్జీవన్‌రామ్ జీవితం స్ఫూర్తిదాయకం

కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి

అనకాపల్లిటౌన్: స్వాతంత్య్ర సమరయోధుడు, దివంగత మాజీ ఉపప్రధాని బాబూజగ్జీవన్‌రామ్ జీవితం స్ఫూర్తిదాయకమని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. జిల్లాసంక్షేమశాఖ ఆధ్వర్యంలో బాబూజగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ యువతకు ఆదర్శప్రాయుడని పేర్కొన్నారు. చిన్న వయసులో కేంద్ర మంత్రిగా పని చేశారన్నారు. సుదీర్ఘకాలం పాటు వివిధ శాఖలను నిర్వహించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. జేసీ కల్పనాకుమారి మాట్లాడుతూ సంకల్పం ఉంటే విజ్ఞానం సంపాదించేందుకు, పదిమందికి మంచి చేసేందుకు అసమానతలు అడ్డురావని జగ్జీవన్‌రామ్ నిరూపించినట్టు తెలిపారు. అంతకుముందు విద్యార్థినులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ భీశెట్టి వరహాసత్యవతి, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కె.అప్పారావు, ఎం.అప్పలరాజు, రేబాక మధుబాబు, సాంఘికసంక్షేమశాఖ ఉపసంచాలకులు అజయ్‌బాబు పాల్గొన్నారు.

పార్టీ కోసం కొత్తవారు రావాల్సిందే..!

- చేరికలపై చంద్రబాబు వ్యాఖ్యలు
- ఇప్పుడున్నవారి బలం చాలదన్నట్లుగా వ్యాఖ్యలు
- అయ్యన్నకు దగ్గరగా.. గంటాకు దూరంగా...!
- చంద్రబాబు రాకముందూ.. వేదికపై కనిపించిన దూరం



వేదికపై ముఖ్యులతో పాటు అయ్యన్నని పిలిచి ఫొటో తీసుకుంటున్న చంద్రబాబు, మరోవైపు కూర్చున్న గంటా

సాక్షి, విశాఖపట్నం : పార్టీ బలోపేతం కావాలంటే కొత్తవారు రావాల్సిందేనని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు వ్యాఖ్యలు చేయడంపై కార్యకర్తలు, నాయకుల్ని విస్మయానికి గురిచేసింది. పరోక్షంగా పార్టీ బలహీనంగా ఉందన్న విషయం అధినేత అంగీకరించడం చర్చనీయాంశమైంది. మరోవైపు అయ్యన్న, గంటా మధ్య ఉన్న విబేధాలు వేదికపై కనిపించాయి. అయ్యన్నని దగ్గరకు తీసుకున్న చంద్రబాబు.. గంటాని దూరం పెట్టడంపై ఆయన వర్గీయులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పీఎం పాలెంలోని వైజాగ్ కన్వెన్షన్‌లో బుధవారం జరిగిన ఉత్తరాంధ్ర జోనల్ సమావేశానికి టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు హాజరయ్యారు. ఊకదంపుడు ఉపన్యాసాలు, టెక్నాలజీ డైలాగులు మళ్లీ చెప్పడంతో కార్యకర్తలు డీలాపడిపోయారు. అధికారంలోకి వచ్చాక జగన్ ఒక్క ఇల్లు కట్టలేదు.. అవునా.. కాదా అని చంద్రబాబు అడిగితే ఒక్కరు కూడా అవునని చెప్పలేదు. అదేవిధంగా వైజాగ్‌ని దోచుకున్నారు.. అవునా.. కాదా అని అడిగినా.. కార్యకర్తల నుంచి సమాధానం రాకపోవడంతో అసహనం వ్యక్తం చేసిన చంద్రబాబు.. మీకు కూడా జగన్ అంటే భయం.. అందుకే అవునని చెప్పడం లేదని కవర్ చేసుకున్నారు. ఇక పార్టీని బలోపేతం కావాలంటే బయటవాళ్లు రావాలన్న బాబు వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. అంటే ఇప్పుడు పార్టీ ఉత్తరాంధ్రలో బలహీనంగా ఉందనా అనే అనుమానాలు కార్యకర్తల్లోనూ, ఇటు నాయకుల్లోనూ కలిగింది. తమ నాయకత్వంపై అధినేతకు నమ్మకం లేదన్న మీమాంసలో పడిపోయారు. మరోవైపు సాధికార సారథులు, ఓటర్ల మ్యాపింగ్‌లో పూర్ పెర్ఫార్మెన్స్ కనబరిచిన నియోజకవర్గాల ఇన్‌చార్జులు, మండల అధ్యక్షులు, నాయకులు సిగ్గు తెచ్చుకోవాలంటూ అందరి ముందరే విమర్శించడంపైనా మండిపడుతున్నారు.

అయ్యన్నను పిలిచారు.. గంటాని దూరం పెట్టారు..

పార్టీలో వర్గవిబేధాలపైనా చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. పార్టీలో నేతలు అందరినీ కలిపేసుకుని పోవాలనీ.. కొందరు విబేధాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని చంద్రబాబు అన్నారు. పార్టీలో గ్రూపులు పెట్టిన వారికి, విబేధాలు సృష్టించిన వారికి కాకుండా... త్యాగాలు చేసినవారికి మాత్రమే పదవులు వస్తాయని స్పష్టం చేశారు. గంటా, అయ్యన్న, వంగలపూడి అనితని ఉద్దేశించి చంద్రబాబు వ్యాఖ్యలు చేసినట్లు స్పష్టమైంది. అంతకుముందు చంద్రబాబు రాకముందు కూడా వీరి మధ్య విబేధాలు బయటపడ్డాయి. సభకు ఆలస్యంగా వచ్చిన అయ్యన్న, అనితను వేదికపై ముందు వరుసలో కూర్చోవాలని నాయకులు చెప్పినా.. గంటా ముందు వరుసలో ఉన్నారని చివర్లో కూర్చున్నారు. చంద్రబాబు వచ్చినప్పుడు గంటా విమానాశ్రయానికి వెళ్లారనీ.. అయితే.. ఎయిర్‌పోర్టుకు ఎవరూ రావొద్దని చంద్రబాబు చెప్పడంతో గంటా తిరిగి వెనక్కు వచ్చేశారని సమాచారం. అదేవిధంగా బాబు వచ్చిన తర్వాత.. దూరంగా ఉన్న అయ్యన్నని దగ్గరకు పిలిచారు. కానీ.. పక్కన ఉన్న గంటాని మాత్రం చంద్రబాబు పట్టించుకోలేదు. అదేవిధంగా సమావేశం ప్రారంభమైనప్పుడు.. బాబుతో పాటు అచ్చెన్న, ఇతర ముఖ్యులతో పాటుగా అయ్యన్నని కూర్చోవాలని చంద్రబాబు చెప్పారే తప్ప.. గంటాకు ప్రాధాన్యమివ్వకపోవడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

పేదల సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం



సభకు హాజరైన మహిళలు



చెక్కును అందజేస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

వైఎస్సార్ ఆసరా సభలో మంత్రి అమర్‌నాథ్

కశింకోట: సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు స్వయం సహాయక సంఘాల రుణాలను మాఫీ చేస్తున్నారని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో బుధవారం మూడో విడత ఆసరా సంబరాలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో మహిళలకు రూ.13.31 కోట్ల ఆసరా చెక్కును మంత్రి అమర్‌నాథ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019లో ఎన్నికల ముందు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాల మహిళల రుణాల మాఫీకి హామీ ఇచ్చారన్నారు. ఆ మేరకు మూడు విడతలుగా మహిళల ఖాతాల్లో నగదు జమ చేశారని చెప్పారు. చివరి విడతగా వచ్చే జనవరిలో ఆసరా నగదు ఇవ్వనున్నారన్నారు. చంద్రబాబు డ్వాక్రా సంఘాల రుణ మాఫీకి హామీ ఇచ్చి 2014లో అధికారంలోకి వచ్చాక మాఫీ చేయకుండా మోసగించారని విమర్శించారు. ఎన్నికల ముందు పసుపు–కుంకుమ పేరిట రూ.పదివేల నగదు వేసి ఓట్ల కోసం మోసగించడానికి ప్రయత్నించగా మహిళలు తగిన బుద్ధి చెప్పారన్నారు. సీఎం జగన్ నిరంతరం పేదల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతు భరోసా, వైఎస్సార్ ఆసరా, అమ్మ ఒడి తదితర సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో గతంలో ఎన్నడూలేని విధంగా 32 లక్షల మందికి ఇళ్ల పట్టాలు, ఇళ్లు మంజూరు చేసినట్టు తెలిపారు. టీడీపీ హయాంలో ప్రతి పథకానికి మామూళ్లు ఇవ్వాల్సిన దుస్థితిని ప్రజలు ఎదుర్కొన్నారని తెలిపారు. ఇప్పుడు గ్రామ వలంటీర్ల వ్యవస్థతో ప్రజలకు నేరుగా ప్రభుత్వ పథకాలు చేరువైనట్టు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో 175 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను నిలిపి పోటీ చేసే సత్తా టీడీపీకి ఉందా? అని ప్రశ్నించారు. ఆ సత్తా లేకే బీజేపీ, జనసేన తదితర పార్టీలతో పొత్తుల కోసం ఆ పార్టీ అర్రులు చాస్తోందని ఎద్దేవా చేశారు. సీఎం జగన్‌కు రానున్న ఎన్నికల్లో సంపూర్ణ మద్దతు అందించి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమానికి ముందు దివంగత మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సభా వేదిక వద్ద మంత్రి అమర్‌నాథ్‌కు మహిళలు పెద్ద ఎత్తున కోలాటాలతో ఘన స్వాగతం పలికారు. సభ అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం నిర్వహించారు.

భారీగా తరలివచ్చిన మహిళలు

సభకు మండలంలో పలు గ్రామాల నుంచి భారీగా మహిళలు తరలి వచ్చారు. దీంతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. అదనంగా టెంట్లు వేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, మండలాధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ మంత్రి జయరజని, ఎంపీడీవో కొంకి అప్పారావు, వైస్ ఎంపీపీలు పెంటకోట జ్యోతి, నమ్మి మీనా, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కూండ్రపు అరుణ, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కుమారస్వామి,వైఎస్సార్ క్రాంతి పథకం ఏపీఎం ఎస్.శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మలసాల కిషోర్, పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు నీటిపల్లి లక్ష్మి పాల్గొన్నారు.

సామాన్య భక్తులకే పెద్దపీట

- చందనోత్సవానికి విశేష ఏర్పాట్లు
- ప్రొటోకాల్ భక్తులకైనా టికెట్ తప్పనిసరి
- రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ వెల్లడి



సింహగిరిపై చందనోత్సవ ఏర్పాట్లపై పరిశీలిస్తున్న దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ

సింహాచలం : వరాహ లక్ష్మీ నృసింహస్వామికి ఈ నెల 23న జరిగే చందనోత్సవానికి సంబంధించి అన్ని శాఖల సమన్వయంతో విశేషంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. సింహాచల శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని బుధవారం ఆయన దేవదాయశాఖ కమిషనర్ హరిజవహర్‌లాల్‌తో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా చందనోత్సవం నిర్వహణకు సంబంధించి రూపొందించిన ప్రణాళికను పరిశీలించారు. ఏయే ప్రదేశాల్లో ఏయే ఏర్పాట్లు చేస్తారో.. ఆ ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ చందనోత్సవానికి వచ్చే భక్తులంతా స్వామి నిజరూపదర్శనం చేసుకుని.. సంతృప్తిగా తిరిగి వెళ్లేలా ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ఉచిత దర్శనం భక్తులకు ప్రత్యేక క్యూలు, వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. వీఐపీలకు పరిమితమైన టైమ్ స్లాట్‌ను ఏర్పాటు చేస్తున్నామని, ఆ సమయంలోనే రావాలని ముందుగానే వారందరికీ తెలియజేస్తామన్నారు. రూ.1500 టికెట్ తీసుకునే వారికి నీలాద్రిగుమ్మం వద్ద నుంచి దర్శనం అందజేస్తామన్నారు. అన్ని క్యూల్లోని భక్తులకు స్వామి కనిపించేలా వివిధ స్థాయిల్లో ర్యాంపులు వేస్తామన్నారు. ప్రొటోకాల్ భక్తులెవరైనా టికెట్ తీసుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో ఘాట్‌రోడ్డను విస్తరిస్తామని వెల్లడించారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం దేవస్థానానికి ప్రసాద్ స్కీమ్‌లో నిధులు కేటాయించిందని.. ఆ నిధులతో పలు అభివృద్ధి పనులు చేపడతామన్నారు. దేవస్థానం ఈవో వి.త్రినాథరావు, ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు తదితరులు మంత్రికి చందనోత్సవ ఏర్పాట్లు వివరించారు. ముందుగా మంత్రికి ఆలయ ధ్వజస్తంభం వద్ద అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు.

కలెక్టర్, సీపీ క్షేత్రస్థాయి పరిశీలన

చందనోత్సవం ఏర్పాట్లపై కలెక్టర్ మల్లికార్జున, నగర పోలీస్‌కమిషనర్‌శ్రీకాంత్ బుధవారం పరిశీలన చేశారు. దేవస్థానం అధికారులు రూపొందించిన ప్రణాళిక ప్రకారం ఏర్పాట్లు జరిగే ప్రదేశాల్లో పర్యటించారు.క్యూలు, భక్తులు వాహనాల పార్కింగ్, సదుపాయాల కోసం చేస్తున్న ఏర్పాట్ల మాస్టర్ ప్రణాళికను పరిశీలించారు.

క్లుప్తంగా

జిల్లా స్థాయి భజన పోటీల విజేత పార్వతీపురం

మాడుగుల రూరల్ : కె.జె.పురంలో బాలాంజనేయ స్వామి తీర్థం సందర్భంగా మంగళవారం ఉదయం నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు జిల్లా స్థాయి భజన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి 20 భజన బృందాలు పాల్గొన్నాయి. ఈ పోటీలులో ప్రథమ బహుమతి పార్వతీపురం భజన బృందం జట్టుకు లభించింది. ద్వితీయ బహుమతి కొత్త పాలెం భజన బృందానికి, తృతీయ బహుమతి వరాహపురం భజన బృందానికి లభించాయి. వీరికి వరుసగా రూ.12,116, రూ.8,116, రూ.6,116 చొప్పున్న నగదును అందజేశారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా విశాఖ స్టీల్ ప్లాంట్ విశ్రాంత జనరల్ మేనేజర్ ఎస్.ఎల్.పి. రావు, గోవాడ సుగర్స్ పరిపాలనాధికారి పప్పల వెంకటరమణమూర్తి(దాసు), విశాఖకు చెందిన భగవద్గీత ప్రచారకులు, తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మాచార్యులు కోట రామకృష్ణనాయుడు, అనకాపల్లికి చెందిన కె.నాగేశ్వరావు వ్యవహరించారు. వీరిని పోటీల అనంతరం బాలంజనేయ ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ జామి రమణ బాబు, నాయకుడు ఆడారి కన్నారావు, విశ్రాంత ఉపాధ్యాయుడు రాపేట రామకొండలరావు, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. మంగళవారం ఉదయం 11 గంటల నుంచి బుధవారం తెల్లవారుజాము 2 గంటల వరకు జరిగిన ఈ పోటీలను తిలకించడానికి గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా ధర్మపీఠం పండగ



చల్లని తల్లి వేపచెట్టును శాంతింప చేస్తూ పసుపునీరు పోస్తున్న మహిళలు

రావికమతం : చినపాచిల గ్రామంలో న్యాయదేవతగా పేరొందిన ధర్మపీఠం(పెద్దరాయి) పండగను బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచీ బిందెలతో పసుపు నీళ్లు తెచ్చి పెద్ద రాయికి, వేపచెట్టుకు అభిషేకం చేశారు. యువకులు, పిల్లలు, మహిళలు రంగులు పూసుకుని కేరింతలు కొట్టారు. దేముడి గుడిలోనైనా అబద్ధం చెబుతారేమో కానీ చినపాచిల పెద్ద రాయిపై నిలబడి ఎవ్వరూ అబద్ధం చెప్పేందుకు సాహసించరు. ఎన్నో తగవులను తీర్చిన ఈ ధర్మపీఠాన్ని గ్రామస్తులు దేవతగా కొలుస్తుంటారు. ఏటా పండగ జరిపి, పూజలు చేస్తుంటారు.

ధర్మపీఠం చరిత్ర : గ్రామంలోని ఓ కొండపై పూర్వం రుషులు ఈ రాళ్లపైనే కూర్చుని తపస్సు చేసేవారట. వారు గతించిన తర్వాత ఆ రాళ్లకు మహిమలున్నాయని భావించిన పూర్వీకులు ఆ రాళ్లను గ్రామానికి తెచ్చి, వేప చెట్టు వద్ద ప్రతిష్ట చేశారు. వాటిని భక్తి శ్రద్ధలతో పూజిస్తున్నారు. గ్రామంలో ఎవరైనా గొడవలు పడితే ఆ రాయి వద్దకు రప్పించి, తగవులు తీర్చేవారట. ఆ ఆనవాయితీ ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. ఆ రాయి పై నిలబడి ఎవ్వరైనా నిజం చెప్పాల్సిందే. లేకుంటే ఎన్నో కష్టాల పాలవుతారని నమ్మకం. ఈ విషయం అందరికీ తెలిసి, ఎక్కడెక్కడి నుంచో తగవులు తీర్చుకునేందుకు ఈ గ్రామానికి వస్తుంటారు. అంతటి మహిమ గల ఆ పెద్దరాయి పండగను ఏటా మాదిరే ఈసారీ ఘనంగా నిర్వహించారు.

జగ్జీవన్‌రామ్ ఆశయ సాధన దిశగా జగన్ పాలన

- ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు
- మంత్రి గుడివాడ అమర్‌నాథ్



తారువలో బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు



బాబూజగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి అమర్‌నాథ్, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జేసీ కల్పనాకుమారి తదితరులు

దేవరాపల్లి: బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయ సాధన దిశగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. తారువలోని క్యాంప్ కార్యాలయంలో బుధవారం జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడిగా, దేశానికి ఉప ప్రధానిగా జగ్జీవన్‌రామ్ విశేషసేవలందించారని తెలిపారు. దళితులు, అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని చెప్పారు. జగ్జీవన్‌రామ్ అడుగుజాడల్లో నడుస్తూ బడుగు, బలహీన వర్గాల ప్రజలకు సీఎం జగన్ అండగా నిలుస్తున్నారన్నారు. ఆయన స్ఫూర్తితో విప్లవాత్మక సంస్కరణలతో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. రాజకీయ, నామినేటెడ్ పదవులు, రాష్ట్ర కేబినెట్‌లో సైతం సామాజిక న్యాయం పాటించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ మాత్రమేనని చెప్పారు. నేటి యువత జగ్జీవన్‌రామ్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో దేవరాపల్లి జెడ్పీటీసీ కర్రి సత్యం, కె.కోటపాడు సీఐ ఎస్. తాతారావు, స్థానిక ఎస్‌ఐ డి. నాగేంద్ర, పలు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ ఆశయసాధనకు కృషి

అనకాపల్లిటౌన్: బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయసాధనకు అందరూ కృషి చేయాలని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. అనకాపల్లి- చోడవరం రహదారిలో స్థానిక చోడవరం బస్టాప్ వద్ద బుధవారం బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జేసీ కల్పనాకుమారి జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ భారత ఉప ప్రధానిగా జగ్జీవన్‌రామ్ ఎనలేని సేవలందించారని చెప్పారు. అంటరానితంపై అలుపెరుగని పోరాటం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో వెంకటరమణ, ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, పట్టణ అధికార ప్రతినిధి ఆళ్ల నాగేశ్వరరావు, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, వైఎస్సార్‌సీపీ నేతలు గైపూరి రాజు, మునూరు శ్రీను, కుండల రామకృష్ణ పాల్గొన్నారు.

రేపటి నుంచి 'జగనన్నే మా భవిష్యత్తు'



జగనన్నే మా భవిషత్తు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్ : రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 7 నుంచి జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. రింగ్‌రోడ్డులోని పార్టీ కార్యాలయంలో మా నమ్మకం నువ్వే జగన్ పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సంక్షేమ పథకాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించేలా వివరించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జెడ్పీటీసీ దంతులూరి శ్రీధర్‌రాజు, జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లి బాబు, కశింకోట ఎంపీపీ కలగా లక్ష్మీ, పట్టణ అధికార ప్రతినిధి ఆళ్ల నాగేశ్వరరావు, ఎన్టీఆర్ ఆస్పత్రి డైరెక్టర్ మూనూరు శ్రీనువాసరావు పాల్గొన్నారు.

భయ్యనపల్లిలో అగ్ని ప్రమాదం

- రెండు కుటుంబాలు నిరాశ్రయం
- రూ.ఐదు లక్షల మేర ఆస్తి నష్టం



భయ్యనపల్లి అగ్ని ప్రమాద వివరాలు సేకరిస్తున్న ఎంఆర్ఐ జిలానీ



అగ్ని బాధిత కుటుంబాలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ పార్వతి, స్థానిక నాయకులు

గంగవరం : మండలంలోని భయ్యనపల్లి గిరిజన గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో తాటాకుల ఇల్లు దగ్ధమై రెండు నిరుపేద కుటుంబాలు కట్టు బట్టలతో నిరాశ్రయులుగా మిగిలాయి. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన కోమటి సూర్యం, కోమటి ప్రసన్నల కుటుంబాలు సర్వం కోల్పోయి, కట్టు బట్టలతో వీధిన పడ్డారు. రాత్రి 11 గంటల సమయంలో ఒక్కసారిగా మంటలు వ్యాప్తి చెందడంతో ఈ ప్రమాదాన్ని అదుపు చేయలేకపోయామని గ్రామస్తులు తెలిపారు. ప్రమాద సమాచారంతో సర్పంచ్ బూరుకట్ల పార్వతి, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగేశ్వరరావు, బలుమూరి సత్యనారాయణ(దొర), సంజీవరావు ప్రమాద స్థలానికి చేరుకున్నారు. బుధవారం ఉదయం రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. తహసీల్దార్ శ్రీమన్నారాయణ ఆదేశాల మేరకు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఫయాజ్‌భాషా(జిలానీ), వీఆర్వో రాజేశ్వరి అగ్ని ప్రమాద బాధితులను పరామర్శించారు. ఆర్‌ఐ జిలానీ మాట్లాడుతూ ఈ ప్రమాదం వల్ల సుమారుగా రూ.ఐదు లక్షల మేర ఆస్తి నష్టం అయిందన్నారు. బాధితులకు తక్షణ సాయం అందిస్తామని ఆర్‌ఐ తెలిపారు. రేషన్, ఆధార్, బ్యాంక్ పాసు పుస్తకాలు వంటివి మంజూరుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇనుప బీరువాలు, వంటసామాగ్రి, మూడు కాటాల జీడిమామిడి పిక్కలు, నాలుగు బస్తాలు బియ్యం, రూ.లక్ష నగదు, విలువైన బంగారు ఆభరణాలు, రేషన్, ఆధార్, విలువైన పత్రాలు దగ్ధం కావడంతో సర్వం కోల్పోయామని బాధితులు రోధించారు. బాధిత కుటుంబాలకు రెవెన్యూ శాఖ పరంగా తక్షణ సాయంగా 50 కేజీల బియ్యం, వంటనూనె, కంది పప్పు సరుకులను సర్పంచ్ బూరుకట్ల పార్వతి, వార్డు సభ్యులు రేగం బేబీ, ఆర్‌ఐ జిలానీ, పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నాగేశ్వరరావు, బలుమూరి సత్యనారాయణ, సంజీవిరావు, బుర్రే శ్రీను, లక్షణరావు, అచ్చియ్య బాధితులను పరామర్శించారు. అగ్ని ప్రమాద విషయాన్ని ఎమ్మెల్సీ అనంతబాబు, ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి దృష్టికి ఫోనులో వారు వివరించగా బాధిత కుటుంబాలకు సాయం అందిస్తామని వారు హామీ ఇచ్చారు.

భయ్యనపల్లి అగ్నిప్రమాద బాధిత కుటుంబాన్ని స్థానిక ఎస్‌ఐ సిహెచ్.చినబాబు పరామర్శించి 50 కేజీల బియ్యం, కాయగూరలు పోలీసు శాఖ తరపున అందచేశారు.

సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట

గడప గడపకు మన ప్రభుత్వంలో విప్ కరణం ధర్మశ్రీ



చాకిపల్లిలో మహిళలతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం : అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ పథకాలు అందించి, అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనిచేస్తుందని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. చోడవరం మండలం చాకిపల్లి, రామజోగిపాలెం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు మంజూరుపై ఆరా తీశారు. సచివాలయం, వలంటీర్ల పనితీరుపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అర్హతే కొలమానంగా పార్టీలకు అతీతంగా ప్రజలందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామన్నారు. వ్యవసాయం, విద్య, వైద్యం, మహిళాసాధికారత ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని ధర్మశ్రీ చెప్పారు. వ్యవసాయాన్ని పండగ చేయాలని, వ్యవసాయ పనిముట్లు, విత్తనాలు, ఎరువులకు సబ్సిడీ ఇస్తున్నట్టు తెలిపారు. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల ద్వారా పండిన పంటను కూడా అక్కడే అమ్ముకునే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పోతల జానకీ ప్రసాద్, గంటా కృష్ణ స్థానిక సమస్యలను ధర్మశ్రీ దృష్టికి తీసుకొచ్చారు. గ్రామంలో సీసీ రోడ్లు, పలు కాలనీల్లో కాల్వల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనిపై ధర్మశ్రీ స్పందించి ఆయా అభివృద్ధి పనులు మంజూరు చేస్తామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, ఎంపీపీ గాడి కాసు, తహసీల్దార్ తిరుమలబాబు, ఎంపీడీవో చైతన్య, పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డి వెంకట్రావు, వైస్ ఎంపీపీ బైన ఈశ్వరరావు, యలమంచిలి వెంకట్రావు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పనితీరు ప్రజలకు వివరించండి

జగనన్నే మా భవిష్యత్తుపై పార్టీ శ్రేణులతో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

రోలుగుంట: జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాలు ఈ నెల 7 నుంచి 20 తేదీ వరకూ గ్రామాల్లో నిర్వహించనున్నట్టు ప్రభుత్వం విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. బుధవారం ఎస్.కొత్తూరులో మండల పరిధి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ శ్రేణులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కార్యక్రమాల నిర్వహణ, ప్రజలను నేరుగా కలసి వారి సమస్యలు తెలుసుకోవడం, పరిష్కార మార్గాలు తదితర అంశాలపై మాట్లాడారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా పాలన సాగించామని, ప్రజల జీవనశైలిలో వచ్చిన మార్పును కళ్లకు కట్టినట్టు చూపించే బాధ్యత సర్పంచ్, ఎంపీటీసీలు, పార్టీ శ్రేణులు, ప్రధానంగా గృహసారథులు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వంతో పోలిస్తే సంక్షేమ పథకాల అమలు, వలంటీర్ల సేవలు, సచివాలయ వ్యవస్థతో మెరుగైన పాలన అందించామని, ఇదంతా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పమేనని ప్రజలందరికీ తెలియజేయాల్సిన బాధ్యత మనపైనే ఉందన్నారు. అందుకు బాధ్యత వహించి, 7 నుంచి ప్రారంభంకానున్న కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో కృషి చేయాలని పార్టీ శ్రేణులకు ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు యర్రంశెట్టి రాజారావు, పోతల లక్ష్మీ శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షుడు మద్దు అప్పలనాయుడు, తాజా, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తపట్నం, వాడనర్సాపురానికి నేవీ ప్యాకేజీ

- ఆందోళన విరమించిన ఆ రెండు గ్రామాలు
- ధర్నాను కొనసాగించనున్న కొప్పుగొండుపాలెం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

రాంబిల్లి : నేవీ మెయిన్ గేటు వద్ద నేవీ నిర్వాసితుల ఆందోళన నుంచి వాడనర్సాపురం, కొత్తపట్నం గ్రామాల ప్రజలు బుధవారం విరమించుకున్నారు. ఈ రెండు గ్రామాలకు జీవనభృతి వర్తిస్తుందని ప్రకటన రావడంతో వారు తమ ఆందోళనను విరమించారు. అయితే కొప్పుగొండుపాలెం గ్రామానికి జీవన భృతి వర్తించకపోవడంతో వారు మాత్రం ధర్నా కొనసాగించేందుకు నిర్ణయించారు. బుధవారం ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు(కన్నబాబు) ధర్నా శిబిరాన్ని సందర్శించారు. చివరి దాకా వాడనర్సాపురం, కొత్తపట్నం, కొప్పుగొండుపాలెం మూడు గ్రామాలకు జీవనభృతి ప్యాకేజీ వర్తించాలని ప్రయత్నం చేశామని, అయితే కేంద్ర రక్షణశాఖ అధికారులు వాడనర్సాపురం, కొత్తపట్నం గ్రామాలకే ప్యాకేజీని నెలకు రూ.13 వేలు చొప్పున 10 నెలలు ఇచ్చేందుకు అంగీకరించారని తెలిపారు. గతంలో ఈ మూడు గ్రామాలకు ప్యాకేజీ ఇచ్చారని, దీన్ని అర్థం చేసుకుని కొప్పుగొండుపాలెం గ్రామస్తుల్ని ఆందోళన విరమించాల్సిందిగా ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ ఉప్పలపాటి సుకుమారవర్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

'డ్రెడ్జింగ్'లో చీడపురుగు

- మేనేజ్‌మెంట్ ట్రైనీగా మొదలుపెట్టి.. కీలక స్థాయికి ఎదిగిన ఉద్యోగి
- సంస్థను దుబాయ్‌కి విక్రయించేందుకు బేరం
- నష్టాల బాట పట్టించేందుకు పూర్వ ఎండీతో కలిసి కుట్ర పన్నినట్లు ఆరోపణ
- సీఎస్ఆర్ నిధులు కూడా స్వాహా చేసిన వైనం
- ఆధారాలతో సీబీఐకి ఫిర్యాదు చేసిన ఉద్యోగులు



డీసీఐ కార్పొరేట్ కార్యాలయం

డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌లో తవ్వేకొద్దీ అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. ఎండీ నియామకం మొదలుకొని, సంస్థను విదేశీ కంపెనీలకు విక్రయించేందుకు సొంత ఉద్యోగులే ప్రయత్నించడం తీవ్ర దుమారం రేపింది. తప్పుడు ధృవ పత్రాలతో ఓ ఉద్యోగి ఎండీగా నియమితులు కాగా.. ఆ నియామకం వెనుక మరో అధికారి కుట్ర ఉండటంపై సంస్థ ఉద్యోగులే సీబీఐకి ఫిర్యాదు చేశారు. సీఎస్ఆర్ నిధులను కూడా స్వాహా చేసేసిన ఆ అధికారి అక్రమాలపై సీబీఐ దర్యాప్తునకు ఉపక్రమించింది.

సాక్షి, విశాఖపట్నం : డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(డీసీఐ)లో మేనేజ్‌మెంట్ ట్రైనీగా అడుగు పెట్టిన ఓ వ్యక్తి.. ఆ సంస్థను శాసించే స్థాయికి చేరుకున్నాడు. ట్రైనీగా విధులు ప్రారంభించినప్పటి నుంచి అవినీతికి శ్రీకారం చుట్టిన సదరు ఉద్యోగి అంచెలంచెలుగా ఎదిగాడు. అక్రమంగా వచ్చిన డబ్బును ఉన్నతాధికారులకు ఆశ చూపిస్తూ.. ఆయనతోపాటు విధుల్లో చేరిన వారి కంటే ముందుగానే ప్రమోషన్లు పొందాడు. ప్రస్తుతం సదరు ఉద్యోగి జాయింట్ జనరల్ మేనేజర్ హోదాలో చక్రం తిప్పుతుంటే.. ఆయనతో పాటు విధుల్లో చేరిన వారంతా జాయింట్ మేనేజర్లగా అతడి కింద పనిచేస్తుండటం గమనార్హం.

రిక్రూట్‌మెంట్ కూడా ఆయన కనుసన్నల్లోనే..

ఏదైనా ఒక పనికి సంబంధించిన ఫైల్ ఒక ఉద్యోగి వద్ద ఉంటే.. దాని వల్ల లాభం వస్తుందని అనుకుంటే.. సదరు అధికారి అన్నీ తానై ఆ ఫైల్ పని పూర్తి చేసేసేవారు. ఇదే రీతిలో డీసీఐ ఎండీ నియామకం విషయంలోనూ కీలకంగా వ్యవహరించారు. సదరు అధికారికి సంబంధం లేకున్నా ఎండీగా విక్టర్ నియామకం దగ్గరుండి చేపట్టారు. అక్రమంగా జరిగిన ఈ నియామకంపై దుమారం రేగిన విషయం విదితమే.. దీనిపై విజిలెన్స్ విచారణ చేపట్టి, విక్టర్‌ని విధుల నుంచి తొలగించగా సదరు అక్రమాధికారిని సస్పెండ్ చేశారు. కొద్ది రోజులకే తన పలుకుబడితో సస్పెన్షన్‌ను రీవోక్ చేయించుకొని తిరిగి విధుల్లో చేరిపోయారు. ఈయనకు బాధ్యతలు అప్పగించడం ఇష్టంలేని మంత్రిత్వ శాఖ అధికారులు కోల్‌కతా బ్రాంచ్‌లో ఎలాంటి ప్రాధాన్యం లేని ఆర్‌జీఎంగా పోస్టింగ్ ఇచ్చారు.

అడ్వాన్స్‌డ్ సీఎస్సార్ నిధులు?

సాధారణంగా ఏ సంస్థ అయినా ఆ ఆర్థిక సంవత్సరంలో వచ్చిన లాభాల్ని బేరీజు వేసుకొని కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా సేవా కార్యక్రమాలకు సీఎస్సార్ నిధులను ఖర్చు చేస్తుంటుంది. డీసీఐలో ఈ వ్యవహారాలన్నీ సదరు అధికారి చేతుల మీదుగానే జరిగేవి. ఆ సీఎస్సార్ నిధులను తనకు నచ్చిన సంస్థలు, కాంట్రాక్టర్లకు అప్పగించి భారీ ఎత్తున కమీషన్లు పొందేవారు. అంతేకాకుండా ఏ సంస్థలోనూ లేని విధంగా ముందస్తుగానే సీఎస్సార్ నిధులను ఖర్చు చేసేవారు. ఈ ఏడాది సంస్థకు లాభాలు వస్తాయంటూ అడ్వాన్స్‌డ్ ఫండ్స్ అని కోట్ల రూపాయలు దోచుకున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. డీసీఐలో దోచుకున్న సొమ్ముతో విశాఖపట్నం బీచ్‌రోడ్డులో విలాసవంతమైన అపార్ట్‌మెంట్ కొనుగోలు చేసుకున్నట్లు తెలుస్తోంది.

దుబాయ్ సంస్థకు విక్రయించేలా...?

డీసీఐలో నష్టాల్ని చూపించి, సంస్థను దివాలా తీయించాలనే కుట్రకు సూత్రధారిగా సదరు అధికారే వ్యవహరించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తానే పోస్టింగ్ ఇచ్చిన అప్పటి ఎండీ విక్టర్‌తో కలిసి, ఈ అడ్డగోలు కథని నడిపించారని ఉద్యోగులు చెబుతున్నారు. దుబాయ్‌కి చెందిన ఓ డ్రెడ్జింగ్ సంస్థతో ముంబై, కోల్‌కతాలో చర్చలు జరిపి బేరసారాలు కూడా మాట్లాడుకున్నట్లు తెలుస్తోంది. డీసీఐ ప్రైవేటీకరణ దిశగా వెళ్లిపోతుందంటూ ప్రచారం కూడా చేశారు. ఈ వ్యవహారం అప్పటి ఉద్యోగులు బయటకు తీసుకురావడతో విక్టర్ నియామకంపైన, ఈ అధికారి వ్యవహార శైలిపైన విచారణ ప్రారంభమైంది. ఎండీ, సీఈవో నియమాకంలో అవకతవకలు జరిగిన విషయం వెలుగులోకి రావడం, విజిలెన్స్ విచారణ నిర్వహించి.. ఎండీని తొలగించడం.. ఆయన స్థానంలో కొత్త ఎండీ, సీఈవోగా కెప్టెన్ దివాకర్‌ని నియమించడం చకచకా జరిగిపోయాయి. సదరు అధికారి సస్పెన్షన్‌ను రీవోక్ చేసుకొని మళ్లీ విధుల్లోకి రావడంపై ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది. ఆయన అక్రమాల జాబితాను నివేదిస్తూ సీబీఐకి ఫిర్యాదు చేయడంతో విచారణ ప్రారంభమైంది. ప్రస్తుత ఎండీగా వ్యవహరిస్తున్న కెప్టెన్ దివాకర్‌పైనా విజిలెన్స్ అధికారులు విచారణ చేపడుతున్నట్లు తెలుస్తోంది.

డీసీఐ మాజీ సెక్రటరీపై సీబీఐకి ఫిర్యాదు.!

డీసీఐ మాజీ సెక్రటరీ అశ్వనీ శ్రీకాంత్‌పై సంస్థ ఉద్యోగులు సీబీఐకి ఫిర్యాదు చేశారు. సంస్థలో ఇటీవల జరిగిన పరిణామాలకు శ్రీకాంత్ కీలక సూత్రధారి అంటూ దానికి సంబంధించిన పూర్తి ఆధారాలను సీబీఐకి అందించారు. ఈ ఫిర్యాదుపై ఇప్పటికే డీసీఐలో కొందరు ఉద్యోగుల్ని సీబీఐ అధికారులు విచారించినట్లు తెలుస్తోంది. విక్టర్ నియామకంపై విచారణలో భాగంగా శ్రీకాంత్‌ని అప్పటి డీసీఐ చైర్మన్ రామ్మోహన్‌రావు సస్పెండ్ చేశారు. కొద్ది రోజుల క్రితం సస్పెన్షన్‌ను రీవోక్ చేసుకున్న శ్రీకాంత్ ప్రస్తుతం కోల్‌కతా శాఖలో ఆర్‌జీఎంగా విధులు నిర్వర్తిస్తున్నారు.

కనక మహాలక్ష్మి ఆలయంలో ఆయుష్య హోమం



ఆయుష్య హోమంలో పాల్గొన్న ఉభయదాతలు

దాబాగార్డెన్స్: కనక మహాలక్ష్మి ఆలయంలో అమ్మవారి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకొని బుధవారం ఆయుష్య హోమం జరిపారు. ఉదయం 8 గంటల నుంచి నిర్వహించిన ఈ ప్రత్యేక పూజలో ఆరుగురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి నెలా ఉత్తరా నక్షత్రం రోజున ఉదయం 8 గంటలకు నిర్వహించే ఈ హోమంలో పాల్గొనదలచే భక్తులు పూజా రుసుం కింద రూ.2,516 చెల్లించి పాల్గొనవచ్చని పేర్కొన్నారు. పూజలో పాల్గొనదలచే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806081లో చెల్లించవచ్చు. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు ఆ వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్ర నామాలు, పూర్తి చిరునామా 8985515989కు పంపించాలి. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.రమేష్‌నాయుడు, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, సహాయ కార్యనిర్వహణాధికారి వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

విశాఖ వెళ్లి పింఛన్‌ పంపిణీ



చిన్నిఅప్పారావుకు పింఛన్‌ సొమ్ము అందజేస్తున్న వలంటీర్‌

కశింకోట: కాళ్ల ఆపరేషన్‌ చేయించుకుని నడవలేని స్థితిలో ఉన్న వృద్ధుడికి విశాఖ వెళ్లి పింఛన్‌ అందించారు గ్రామ వలంటీర్‌. వివరాలివి.. స్థానిక దేవర వీధికి చెందిన చిన్ని అప్పారావు విశాఖపట్నంలోని ఆస్పత్రిలో కాళ్ల ఆపరేషన్‌ చేయించుకున్నారు. నడవలేని స్థితిలో విశాఖలోని వారి కుమార్తె ఇంటి వద్ద ఉంటూ చికిత్స పొందుతున్నారు. దీంతో వృద్ధాప్య పింఛన్‌ తీసుకునే అవకాశం లేకపోవడంతో 4వ సచివాలయానికి చెందిన గ్రామ వలంటీర్‌ మంత్రి సౌదామణి విశాఖ వెళ్లి బుధవారం పింఛన్‌ సొమ్ము అందజేశారు. దీంతో అప్పారావు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. ఆమె సేవా దృక్పథాన్ని స్థానికులు అభినందించారు.

నేటి నుంచి బీజేపీ ఆవిర్భావ దిన వేడుకలు

అనకాపల్లిటౌన్‌: బీజేపీ ఆవిర్భావ దినోత్సవాల్లో భాగంగా ఏప్రిల్‌ 6 నుంచి 14వ తేదీ వరకు సామాజిక న్యాయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర బీజేపీ సైనిక్‌ సెల్‌ కో–కన్వీనర్‌ ఆగ్గాల హనుమంతరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేడుకల్లో భాగంగా పలు సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

విద్యుత్‌ లైట్ల ఏర్పాటు



గణేష్‌నగర్‌లో విద్యుత్‌లైట్లు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

అనకాపల్లిటౌన్‌: గ్రామాల్లో పాడైపోయిన విద్యుత్‌ లైట్ల స్థానంలో కొత్త లైట్లు ఏర్పాటు చేస్తున్నట్లు అక్కిరెడ్డిపాలెం సర్పంచ్‌ సాలాపు శాంతి సూరిఅప్పారావు అన్నారు. పంచాయతీ పరిధిలో 40 విద్యుత్‌ లైట్లకు బుధవారం మరమ్మతులు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. పాడైపోయిన రహదారులను దశల వారిగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు బుధవారం 3,669 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్‌ రకం	4,030	4,280
మొదటి రకం	3,920	4,170
రెండో రకం	3,400	4,010
మూడోరకం	3090	3,390

అనకాపల్లి సినిమాలు

సార్‌	రాజా
కోస్టీ	సత్యనారాయణస్క్రీన్‌–1
జాన్‌విక్‌ (చాప్టర్‌–4)	సత్యనారాయణస్క్రీన్‌–2
కబ్జా	షిర్డిసాయి
బలగం	పర్తిసాయి
రంగమార్తాండ	వెంకటేశ్వర
పులి	శ్రీసత్య
దాస్‌ కా ధమ్కీ	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్‌ : జిల్లా ఎన్టీఆర్‌ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 62 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్‌–2 యూనిట్లు, ఏ నెగిటివ్‌–1 యూనిట్‌, బీ పాజిటివ్‌–25 యూనిట్లు, బీ నెగిటివ్‌–1 యూనిట్‌, ఓ పాజిటివ్‌–31 యూనిట్లు, ఓ నెగిటివ్‌–1 యూనిట్‌, ఏబీ పాజిటివ్‌–1 యూనిట్‌ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్‌ సమాచారం

అనకాపల్లిటౌన్‌ : ఇండేన్‌ గ్యాస్‌ ఏజెన్సీ ద్వారా బుధవారం 456 మంది గ్యాస్‌ బుక్‌ చేసుకున్నారు. గతంలో బుక్‌ చేసుకున్న వారిలో 401 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్‌ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

‘ఆసరా’ తో కుటుంబాల్లో వెలుగు

- స్వయంసహాయక సంఘాల మహిళల ఆనందం

కశింకోట: వైఎస్సార్‌ ఆసరా పథకం తమ కుటుంబాల్లో వెలుగులు నింపుతోందని స్వయం సహాయక సంఘాల మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. కశింకోటలోని మండల పరిషత్‌ కార్యాలయ ఆవరణలో బుధవారం నిర్వహించిన వైఎస్సార్‌ ఆసరా పథకం సభకు మండలంలోని పలు గ్రామాల నుంచి మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. సీఎం జగన్‌ చిత్రపటానికి కృతజ్ఞతతో క్షీరాభిషేకం చేశారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ సమక్షంలో తమ మనోగతాన్ని వెల్లడించారు. పాడి పశువుల కొనుగోలు, వ్యాపారం, వ్యవసాయానికి పెట్టుబడులు, కుటుంబ అవసరాలు తదితర వాటికి ఆసరా నగదు ఉపయోగపడుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కూండ్రపు అరుణ తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

మా జీవనానికి ఎంతో ‘ఆసరా’



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మాలాంటి కుటుంబాలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. నాకు వైఎస్సార్‌ ఆసరా పథకంలో మూడు విడతలకు కలిపి రూ. 38,060 వచ్చింది. దీంతో పాటు వైఎస్సార్‌ చేయూత పథకంలో రూ. 45 వేలు వచ్చింది. ఈ నగదుతో రెండు పాడి ఆవులను కొనుగోలు చేశాం. ఇవి మా కుటుంబ జీవనానికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. పెళ్లి అయిన మా కుమార్తె పేరున రేషన్‌ కార్డు, ఆధార్‌ కార్డు పైసా ఖర్చు లేకుండా మార్పు చేశారు.

– పారిపాటి చిన్నమ్మలు, వినన్నపేట

కూరగాయలు పండిస్తున్నాం



వైఎస్సార్‌ ఆసరా పథకంలో మూడు విడతలుగా సుమారు రూ.25 వేలు నగదు అందింది. దీన్ని వ్యవసాయ పెట్టుబడులకు వినియోగించి కూరగాయలు పండిస్తున్నాం. వచ్చిన ఆదాయం కుటుంబ జీవనానికి ఉపయోగపడుతోంది.

– ముచ్చి లక్ష్మి, రామన్నపాలెం

అధిక వడ్డీల బాధ తప్పింది



వైఎస్సార్‌ ఆసరా పథకం రాక ముందు నూటికి రూ.3 వంతున వడ్డీకి అప్పు తెచ్చి విశాఖలో రైతు బజారుకు కూరగాయలు తీసుకెళ్లి వ్యాపారం సాగించే వాళ్లం. కూరగాయల సాగుకు పెట్టుబడి పెట్టడం కష్టమయ్యేది. ఇప్పుడు ఆసరా పథకంలో విడతకు రూ.14 వేలు వంతున రూ.42 వేలు వచ్చింది. దీంతో అప్పులు లేకుండా ఈ నగదుతో కూరగాయల వ్యాపారానికి, వ్యవసాయం సాగు చేయడానికి పెట్టుబడిగా వినియోగిస్తున్నాం. అధిక వడ్డీలతో అప్పు చేసే బాధ తప్పింది.

– బండారు వరలక్ష్మి, తీడ గ్రామం

కుటుంబ అవసరాలు తీరుతున్నాయి



వైఎస్సార్‌ ఆసరా పథకం ద్వారా ఇస్తున్న నగదు కుటుంబ అవసరాలకు ఉపయోగపడుతోంది. ఇప్పటికి రూ.24 వేలు నగదు అందింది. కష్ట సమయాల్లో సంక్షేమ పథకాలు ఆదుకుంటున్నాయి. ఎంతో భరోసా కల్పిస్తున్నాయి.

– గుర్రం సూర్యలక్ష్మి, కశింకోట గ్రామం

గాంధీనగరంలో చోరీ

అనకాపల్లి టౌన్‌: స్థానిక గాంధీనగరంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. పట్టణ ఎస్‌ఐ సింహాచలం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గాంధీనగరానికి చెందిన రఘురాం మంగళవారం సాయంత్రం కొత్తవలసలో జరుగుతున్న పండగకు అత్తారింటికి కుటుంబ సమేతంగా వెళ్లారు. బుధవారం సాయంత్రం వచ్చి ఇంటి తలుపులు తీసి చూడగా.. వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. చోరీ జరిగినట్లు గుర్తించి 100కు డయల్‌ చేశారు. దీంతో క్లూస్‌ టీమ్‌ రంగంలోకి దిగి ఆధారాలు సేకరించింది. రూ.70 వేలు నగదు, ఆరేడు తులాల బంగారం ఆభరణాలు, 10 కిలోల వెండి అపహరణకు గురైనట్టు రఘురాం చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

వృద్ధులకు ప్రత్యేక గుర్తింపు కార్డులు

అనకాపల్లిటౌన్‌: 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు ప్రభుత్వం ప్రత్యేక గుర్తింపు కార్డులు ఇస్తోందని డిజేబుల్‌ వెల్ఫేర్‌ ఫీల్డ్‌ అధికారి ప్రసాదరావు అన్నారు. గవరపాలెం వీవీ రమణ రైతు భారతిలో జిల్లా వయోవృద్ధుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. 60 సంవత్సరాలు నిండిన వృద్ధులకు గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వృద్ధులకు ఏమైనా సమస్యలుంటే ప్రభుత్వం ప్రవేశపెట్టిన 14567 టోల్‌ ఫ్రీ నంబర్‌కు ఫోన్‌ చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కాండ్రేగుల అప్పారావు, సభ్యులు జి.సాంబమూర్తి రాజు, శరగడం కోటేశ్వరరావు, కర్రి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్, జగ్జీవన్‌రాం సేవలు నిరుపమానం



బాబూ జగ్జీవన్‌రాం విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌



డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ విగ్రహావిష్కరణలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌

కశింకోట : స్థానిక గుర్రం జాషువా కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్‌ బి.ఆర్‌.అంబేడ్కర్, మాజీ ఉప ప్రధాని దివంగత బాబూ జగ్జీవన్‌రాంల విగ్రహాలను రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ బుధవారం ఆవిష్కరించారు. జగ్జీవన్‌రాం 116వ జయంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి వారందించిన సేవలు నిరూపమానమైనవని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, సర్పంచ్‌ మంత్రి జయరజని, ఎంపీటీసీ సభ్యురాలు చెవ్వేటి చంద్రమ్మ, వార్డు సభ్యురాలు కొల్లి చిట్టమ్మ, న్యాయవాది కేతా కుసుమ, ఎమ్మార్పీస్‌ జిల్లా నాయకుడు కట్టుమూరి మంగరాజు, దళిత బహుజన ఆదరణ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు కొల్లి చిన అప్పారావు, విగ్రహాల నిర్మాణ కమిటీ సభ్యులు వైరల అప్పారావు, కొల్లి రామంజి, చెవ్వేటి నాగరాజు, చెవ్వేటి ప్రకాష్, కొల్లి రమణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలి

- ‘డైట్‌’ కళాశాల చైర్మన్‌ దాడి రత్నకర్‌
- ఎస్‌ఐపై డీఎస్పీకి డీవీఎన్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ ఫిర్యాదు



డీఎస్పీ మళ్ల మహేష్‌కు ఫిర్యాదు అందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్‌ రమేష్‌

అనకాపల్లిటౌన్‌: స్థానిక డీవీఎన్‌ కళాశాలలోకి పట్టణ ఎస్‌ఐ దివాకర్‌ ప్రవేశించి విద్యార్థుల పట్ల దురుసుగా ప్రవర్తించారని ‘డైట్‌’ కళాశాల చైర్మన్, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్‌ పరిశీలకుడు దాడి రత్నాకర్‌ తెలిపారు. స్థానిక చోడవరం బస్టాప్‌ వద్ద దివంగత ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్‌ జయంతి వేడుకలు జరుగుతుండగా పక్కనున్న కాలేజీ పై అంతస్తు నుంచి విద్యార్థులు కేకలు వేయడంతో కళాశాలలోకి ఆ ఎస్‌ఐ ప్రవేశించారని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్‌ అనుమతి తీసుకోకుండా ప్రవేశించడమే కాకుండా రూమ్‌ వద్ద గందరగోళ పరిస్థితులు సృష్టించారన్నారు. ఎస్‌ఐపై డీఎస్పీ మళ్ల మహేష్‌కు డీవీఎన్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ రమేష్‌ ఫిర్యాదు చేశారు.

కల్యాణమండపానికి శ్రీకారం

- నాలుగు మాసాల్లో పూర్తి చేయాలని మంత్రి అమర్‌నాథ్‌ సూచన



కల్యాణ మండపం నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌

కశింకోట : కశింకోటలోని పంచాయతీ కార్యాలయం ముందున్న మార్కెట్‌ స్థలంలో కల్యాణ మండపం నిర్మాణానికి రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ బుధవారం భూమి పూజ చేశారు. మంత్రి సూచనల మేరకు అరబిందో పరిశ్రమ యాజమాన్యం నియోజకవర్గంలోని నాలుగు ప్రాంతాల్లో బహుళ ప్రయోజన సామాజిక భవనాల నిర్మాణానికి ముందుకొచ్చింది. ఒక్కొక్క దానికి రూ.50 లక్షలు చొప్పున వెచ్చిస్తున్నారు. భూమి పూజ అనంతరం మండపం నిర్మాణంపై పరిశ్రమ వైస్‌ ప్రెసిడెంట్‌ దేముడు, ఇంజినీరింగ్‌ అధికారులతో మంత్రి చర్చించి పలు సూచలు చేశారు. నాలుగు నెలల్లో నిర్మాణం పూర్తి చేయడానికి చర్యలు చేపట్టాలని పరిశ్రమ యాజమాన్యాన్ని కోరారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, పార్టీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు, సర్పంచ్‌ మంత్రి జయరజని, వైస్‌ ఎంపీపీ పెంటకోట జ్యోతి, పంచాయతీ కార్యదర్శి ఎస్‌.రమేష్, పంచాయతీరాజ్‌ డీఈ వేణుగోపాలరావు, ఎంపీటీసీ సభ్యులు యల్లపు వరలక్ష్మి, చెవ్వేటి చంద్రమ్మ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మంత్రి పీటర్‌ వైజిమెన్, ఆర్‌ఈసీఎస్‌ మాజీ డైరెక్టర్‌ పెంటకోట శ్రీనివాసరావు, పార్టీ నాయకుడు నడిపల్లి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

9న హనుమాన్‌ శోభాయాత్ర



శోభాయాత్ర కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సత్యనారాయణ

అనకాపల్లిటౌన్‌: పట్టణంలో ఈ నెల 9న హనుమాన్‌ శోభాయాత్ర నిర్వహించనున్నట్లు హిందూ బంధువుల శోభాయాత్ర కమిటీ సభ్యుడు, హిమశేఖర్‌ విద్యాసంస్థల అధినేత కొణతాల జనార్థన్‌ తెలిపారు. సుంకరమెట్ట జంక్షన్‌ సత్యనారాయణ స్వామి దేవాలయం నుంచి మండలంలో కొత్తూరు ఫ్లై ఓవర్‌ బ్రిడ్జి హనుమాన్‌ దేవాలయం వరకు ఈ యాత్ర జరుగుతుందని పేర్కొన్నారు. ఆ రోజు మధ్యాహ్నం 3గంటలకు యాత్ర ప్రారంభమవుతుందని, సుమారు 7వేల మంది భక్తులు పాల్గొంటారని తెలియజేశారు. అనంతరం శోభాయాత్ర కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్‌ జిల్లా అధ్యక్షుడు బంకుపల్లి సత్యనారాయణ, సభ్యులు డి.డి.నాయుడు, కరణం నూకునాయుడు, పి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నృసింహునికి పుష్పాంజలి నేడు

కశింకోట : స్థానిక వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో గురువారం సాయంత్రం పుష్పాంజలి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు అత్తిలి కోదండపాణి బుధవారం తెలిపారు. ఈ నెల 1న స్వామి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించామని, ఇందులో భాగంగానే పుష్పాంజలి కార్యక్రమం జరపనున్నట్లు వెల్లడించారు.

రేపటి నుంచి ‘జగనన్నే మా భవిష్యత్తు’ కార్యక్రమం



జగనన్నే మా భవిష్యత్తు కిట్లను ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు జానకీరామరాజు



సమావేశంలోమాట్లాడుతున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

అనకాపల్లి టౌన్‌: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని శుక్రవారం విస్తృతంగా నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీ రామరాజు తెలిపారు. స్థానిక శ్రీరామ్‌నగర్‌ మూడో సచివాలయం పరిధిలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వాలంటీర్లతో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో మరోసారి గెలిపించుకోవాలన్నారు. కన్వీనర్లు, గృహసారథులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న పలు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించి, ఇళ్లకు స్టిక్కర్లు అంటించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు మూనూరు శ్రీనివాసరావు, ఎస్‌.కొండలరావు, గైపూర్‌ రాజు, సీహెచ్‌. హేమంత్, చింతా రాంజీ, సీహెచ్‌.నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పథకాలను వివరించాలి

అనకాపల్లి రూరల్‌: ఈ నెల 7 నుంచి చేపట్టనున్న జగనన్నే మా భవిష్యత్‌.. మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో భాగంగా సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు ప్రతీ ఇంటికి వెళ్లి లబ్ధిదారులకు సంక్షేమ పథకాల గురించి వివరించాలని ఎంపీపీ గొర్లి సూరిబాబు సూచించారు. కుంచంగి, కూండ్రం, తగరంపూడి, వెంకుపాలెం, తుమ్మపాల సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులతో మండల పరిషత్‌ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. లబ్ధిదారుల స్పందన 82960 82960 నంబర్‌కు కాల్‌ చేయించాలన్నారు. తుమ్మపాలలో జరిగిన సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌ కుమార్‌ మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని ప్రతీ ఒక్కరు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పల్లెల నాగేశ్వరరావు, రొంగలి అప్పలనాయుడు, శానాపతి పెంటారు, పసుపులేటి రామకృష్ణ, యాదగిరి అప్పారావు, రాపేటి నాగేశ్వరరావు, బాదం తాతారావు, ఎంపీటీసీలు పల్లెల సాయి, వైస్‌ ఎంపీపీ ఆనందరావు, విల్లూరి చంద్రశేఖర్, రాపేటి వెంకటేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

దళితుల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్‌రామ్‌



జగ్జీవన్‌రామ్‌ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్‌ పార్టీ నేతలు



బాబూజగ్జీవన్‌రామ్‌ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు



జగ్జీవన్‌రామ్‌ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దాడి రత్నాకర్‌


అనకాపల్లి టౌన్‌: దివంగత ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్‌ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. అణగారిన వర్గాల అభ్యున్నతికి జగ్జీవన్‌రామ్‌ ఎనలేని కృషి చేశారని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్‌ పరిశీలకుడు దాడి రత్నాకర్‌ అన్నారు. స్థానిక గవరపాలెం అరుంధతీనగర్‌ వద్ద బాబూజగ్జీవన్‌రామ్‌ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రత్నాకర్‌ మాట్లాడుతూ దళితుల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్‌ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 80వ వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కరరావు, పిట్ల నాగేశ్వరరావు, గవర కార్పొరేషన్‌ డైరెక్టర్‌ శిలపరశెట్టి బాబీ, పార్టీ నేతలు డీవీ నర్సింహారావు, పొలిమేర శివ అప్పారావు, మద్దాల భీమేష్, నాగేశ్వరరావు, రేబాక ఇంద్రకుమార్, కోటిపల్లి శ్రీను, బుద్ద శేఖర్, రాము పాల్గొన్నారు.

- స్థానిక కాంగ్రెస్‌ కార్యాలయంలో పార్టీ ఎస్సీ సెల్‌ జిల్లా నాయకుడు కట్టమూరి నూక అప్పారావు.. జగ్జీవన్‌రామ్‌ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ నాయకుడు ఐఆర్‌ గంగాధర్, పట్టణ అధ్యక్షుడు దాసరి సంతోష్, మందా రాజా మాదిగ, పిల్లి త్రినాథ్‌గౌడ్, న్యాయవాది అవినాష్, విజయ్‌ పాల్గొన్నారు.
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు స్థానిక చోడవరం బస్టాప్‌ వద్ద జగ్జీవన్‌రామ్‌ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రి రామకృష్ణ, నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్‌ జిల్లా కార్యదర్శులు ఉడా రమేష్, ఓరుగంటి నాగమణి, ఎంపీటీసీ సభ్యుడు చదరం నాగేశ్వరరావు, మండల అధ్యక్షుడు నర్సింగ్‌యాదవ్, ఆడారి రాజు పాల్గొన్నారు.
- స్థానిక చోడవరం బస్టాప్‌ ఎదురుగా ఉన్న రామ్‌ విగ్రహానికి ఎమ్మార్పీఎస్‌ పట్టణ అధ్యక్షుడు కట్టమూరి మంగరాజు, సంఘ సభ్యులు కొల్లి చిన అప్పారావు, సూదికొండ మాణిక్యాలరావు, తదితరులు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.



జగ్జీవన్‌రామ్‌ విగ్రహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటిస్తున్న మంగరాజు

మృతుని కుటుంబానికి బీమా పంపిణీ



బాధిత కుటుంబానికి బీమా చెక్కు అందజేస్తున్న బ్యాంకు అధికారులు

అనకాపల్లి రూరల్‌: మృతుని కుటుంబానికి ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా పథకం ద్వారా మంజూరైన బీమా పరిహారం రూ.2 లక్షలను ఏపీజీవీబీ తుమ్మపాల శాఖ అధికారులు బుధవారం అందజేశారు. మండలంలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన మువ్వల అప్పలనాయుడు ఇటీవల మరణించడంతో అతని భార్య లక్ష్మికి బ్యాంకు మేనేజర్‌ కుప్పిలి వెంకట శ్రీనివాసరావు బీమా సొమ్మును చెక్కు రూపంలో అందించారు. జగన్నాథపురంలో జరిగిన కార్యక్రమంలో బ్యాంక్‌ ఫీల్డ్‌ ఆఫీసర్‌ శ్రీనివాసరావు, సర్పంచ్‌ మువ్వల రాము, పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు జోగినాయుడు, వెలుగు కో–ఆర్డినేటర్‌ శారద, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆయుర్వేదంతో దీర్ఘకాలిక వ్యాధులు దూరం



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యరాలు కె.లావణ్య

అనకాపల్లి టౌన్‌: తులసి, తిప్పతీగ, వేప, పసుపు, నేలనేము, నేల ఉసిరి, సొంటి, మిరియాలు, ధనియాలు, జీలకర్ర నిత్య జీవితంలో ఉపయోగించడం వల్ల పలు వ్యాధుల నుంచి విముక్తి లభిస్తుందని ఎన్టీఆర్‌ వైద్యాలయం ఆయుర్వేద విభాగం వైద్యురాలు కె.లావణ్య అన్నారు. స్థానిక జార్జ్‌ క్లబ్‌ ఆవరణలో సీనియర్‌ సిటిజన్‌ సంఘం అధ్యక్షుడు కె.వి.గౌరీపతి ఆధ్వర్యంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కరోనా తరువాత ఆయుర్వేదంపై ప్రజలకు అవగాహన పెరిగిందన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు ఆయుర్వేదంలో ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. అశ్వగంధ, త్రిఫలచూర్ణం, చవనప్రాస, అగస్త్యహరిత చూర్ణం వంటి వాటిపై ఆమె అవగాహన కల్పించారు. అనంతరం డాక్టర్‌ లావణ్యను సంఘం సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి బి.ఎల్‌.ఎస్‌.శర్మ, కోశాధికారి సత్యనారాయణ, సభ్యులు ఎం.బి.స్వామి, కుండల రామకృష్ణ, నల్ల దేముళ్లు, బుద్ధ వీరునాయుడు, ఆర్‌ఎంపీ సత్యనారాయణ పాల్గొన్నారు.